విశాఖపట్టణం
శనివారం 12 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 211 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool




ప్రపంచంలో సగం జనాభాకు

# బ్రిక్స్ దేశాలు ప్రాతినిధ్యం

బ్రిక్స్ దేశాలకు భారీ దేశీయ మార్కెట్లు ఉన్నాయన్న పుతిన్

2

# వాట్సప్ మెసెజ్ పైనే శ్రద్ధ..

# ఫైళ్లపై లేదేం..?

ఫైళ్ల క్లియరెన్స్‌కు సమయం ఎందుకు లేదు

కలెక్టర్ల సదస్సుకు గైర్హాజరు కావడానికి ఎంత ధైర్యం

నిర్ణయాల్లో జాప్యాన్ని సహించం

కలెక్టర్లకు సీఎం చంద్రబాబు వార్నింగ్

పలు అంశాలపై వరుసగా క్లాస్‌లు



(అమరావతి - జయజయహే)

వాట్సప్ మెసేజ్‌లపై చూపిస్తున్న శ్రద్ధ శాఖాపరమైన ఫైళ్ల క్లియరెన్స్‌పై ఎందుకు ఉండటం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోన్లు లేకుండా కొన్ని గంటలు కూడా ఉండలేకపోతున్నారా అని అసహనం వెలిబుచ్చారు. కలెక్టర్ల సదస్సుకు గైర్హాజరు కావడానికి ఎంత ధైర్యం అని మండిపడ్డారు. మంత్రులు, సెక్రటరీలు, హెచ్ఓడీలు, జిల్లా కలెక్టర్ల స్థాయిలో ఫైళ్ల క్లియర్ కావడానికి పడుతున్న సమయాన్ని సీఎం స్వయంగా వెల్లడిస్తూ, నిర్ణయాల్లో జాప్యాన్ని ఏమాత్రం సహించబోనని స్పష్టం చేశారు. అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు జరుగుతోంది. కలెక్టర్ల సమావేశం రెండవ రోజున 'సూపర్ సిక్స్' కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో హెచ్ఓడీల వద్ద ఫైళ్లు ఎందుకు ఆలస్యమవుతున్నాయని సీఎం నిలదీశారు. ఫైళ్లు పెండింగ్‌లో పెట్టే అధికారుల నుంచి వివరణ తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. రాబోయే రోజుల్లో ఇలాంటి అధికారుల ..మిగతా 2లో



# శతశాతం ఫలితాలు సాధించాలి

విద్యాప్రమాణాలు, వసతులపై పర్యవేక్షణ

కలెక్టర్లు కార్యాచారణ రూపొందించాలి

కలెక్టర్ల సదస్సులో మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలు

(అమరావతి - జయజయహే)

పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించే దిశగా కలెక్టర్లు కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. బోర్డు పరీక్షల్లో ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపుతోపాటు పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లా కలెక్టర్లతో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై వారికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండటంతోపాటు, నూతన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు ..మిగతా 2లో

# ఆయుధాలను దోచినోడు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్

బొల్లారంలో తుపాకులు, మందుగుండు సామాగ్రి చోరీ కేసు

మిస్టరీని ఛేధించిన పోలీసులు

త్వరితగతిన రిటైర్డ్ అయ్యాననే అసంతృప్తితోనే చోరీ

(హైదరాబాద్ - జయజయహే)

సికింద్రాబాద్ బొల్లారంలో ఉన్న 20వ బెటాలియన్ మద్రాస్ రెజిమెంట్ నుంచి భారీ స్థాయిలో తుపాకులు, మందుగుండు సామగ్రి చోరీకి గురైన కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. ఈ దొంగతనానికి పాల్పడిన విశ్రాంత ఆర్మీ హవిల్దార్‌ను సెప్టెంబర్ 11న ప్రత్యేక బృందాలు అరెస్ట్ చేశాయని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ మీడియా సమావేశంలో వెల్లడించారు. బొల్లారం పోలీసులు, హైదరాబాద్ సిటీ పోలీస్ టాస్క్ ఫోర్స్, మల్కాజ్‌గిరి కమిషనరేట్ ఎస్ఓటీ బలగాలు సంయుక్తంగా ఈ నిఘా ఆపరేషన్‌ను చేపట్టి నిందితుడిని పట్టుకున్నాయి. అరెస్ట్ అయిన నిందితుడిని నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం జంగం రెడ్డి పల్లికి చెందిన ..మిగతా 2లో





# ఉత్తరాంధ్రకు వర్షాలు

మోస్తారు నుంచి భారీ వర్ష సూచన

40 నుంచి 50కి.మీ. వేగంతో గాలులు

వాతావరణ శాఖ వెల్లడి

అమరావతి - జయజయహే)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా--ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు ....మిగతా 2లో




లైసెన్స్‌లు మరో ఏడాది

# పొడిగింపు

3736 దుకాణాలకు ఓకే

ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే రూ. 10 లక్షల జరిమానా

కొత్త ఎక్సైజ్ పాలసీ ఖరారు చేసిన ప్రభుత్వం

జయజయహే

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2026-27 సంవత్సరానికి సంబంధించి నూతన ఎక్సైజ్ పాలసీని ఖరారు చేస్తూ అత్యంత కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో మద్యం విక్రయాల్లో పారదర్శకతను పెంచడం, అక్రమ మద్యం రవాణా, కల్తీని అరికట్టడమే లక్ష్యంగా ఈ నూతన విధానాన్ని రూపొందించారు. ఈ పాలసీ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 3,736 మద్యం దుకాణాల లైసెన్సులను మరో ఏడాది కాలానికి రెన్యువల్ చేయనుండగా, ..మిగతా 2లో

# అనలాగ్ పనీర్‌పై నిషేధం

తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం

కల్తీ, కృత్రిమ, నాన్-డైరీ ఉత్పత్తులతో తయారు

ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం




(హైదరాబాద్ - జయజయహే)

కల్తీ, కృత్రిమ, నాన్-డైరీ ఉత్పత్తులతో తయారుచేసే 'అనలాగ్ పనీర్' పై తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని అనలాగ్ పనీర్ ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, పంపిణీ, విక్రయాలను పూర్తిగా నిషేధిస్తూ తెలంగాణ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ స్టాండర్డ్స్ అథారిటీ ప్రకటన విడుదల చేసింది. ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి అమల్లోకి వచ్చి... ఒక ఏడాది పాటు కొనసాగుతుందని స్పష్టం చేసింది. సాధారణంగా మనం వాడే సాంప్రదాయ పనీర్ పాల ఉత్పత్తులతో తయారవుతుంది. కానీ 'అనలాగ్ పనీర్' అనేది పాలకు బదులుగా నాన్-డైరీ పదార్థాలు, కూరగాయల నూనెలు, స్టార్చ్, ఇతర రసాయనాలను ..మిగతా 2లో



# సాధిక్ అకాడమీ సీజ్..!

ల్యాప్ టాప్‌లు, కీలక ఆధారాలు స్వాధీనం

సీన్ రీ కనస్ట్రక్షన్‌లో చర్యలు

సౌజన్య టార్గెట్ గా పక్కా స్కెచ్

ఆస్తి చేజిక్కించుకోవడం కోసం క్రూరం

2

# విద్యతో పాటు ఆరోగ్యానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే గంటా

**ఆనందపురం, సెప్టెంబర్ 11, జయ జయహే**

విద్యతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సంగీత ప్రేరణ వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థినుల్లో ఆరోగ్యం - రుతుస్రావ శుభ్రతపై శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా కేజీబీవీలో మౌలిక సౌకర్యాలు కల్పించామని, అటు విద్యలో ఇటు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే తమ కష్టానికి సార్ధకత చేకూరుతుందని చెప్పారు. రాష్ట్రంలో 356 కేజీబీవీల్లో ఆనందపురం కేజీబీవీని ఆదర్శ కేజీబీవీగా తీర్చి దిద్దుతామని ప్రకటించారు. 2024 లో గంటా రవితేజ పుట్టినరోజైన అక్టోబర్ 30 న ప్రారంభించిన కేజీబీవీలో వసతుల కల్పనకు రూ.2 కోట్లు స్వచ్ఛందంగా ఖర్చు చేసిన ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ ను అభినందించారు. సంగీత ప్రేరణ వికాస్ ఫౌండేషన్ ఇతర కేజీబీవీలకు కూడా సేవా కార్యక్రమాలు విస్తరించాలని కోరారు. ఆరోగ్యం, రుతుస్రావ పరిశుభ్రతపై మహాత్మా గాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ మాధురి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సంగీత ప్రేరణ వికాస్ ఫౌండేషన్ తరపున విద్యార్థినులకు బయో డిగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేశారు. ఆరోగ్యకర అలవాట్ల సహా అవసరమైన పరిశుభ్రత ఉత్పత్తులను అందించడమే ఫౌండేషన్ ప్రధానోద్దేశమని ట్రస్టీలు హర్షిణి, రోషిణిలు తెలిపారు. కేజీబీవీలో ఏర్పాటు చేసిన నూతన టాయిలెట్లు, దోభీ ఘాట్, డైనింగ్ హాల్, బంకర్ బెడ్స్ తదితర వసతులను గంటా పరిశీలించారు.




**సాంస్కృతిక కార్యక్రమాలకు రూ.లక్ష విరాళం**

విద్యార్థుల్లో సాంస్కృతిక ప్రతిభ ప్రోత్సాహానికి ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ విరాళంగా ప్రకటించిన రూ. లక్షను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కేజీబీవీకి అందజేశారు. అలాగే విద్యార్థులకు భోజన ప్లేట్లు.. ఇంగ్లీషులో ప్రతిభ చూపిన వారికి బ్లేజర్లు అందించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సమగ్ర శిక్ష ఏపీడీ చంద్రశేఖర్, ప్రేరణ ఫౌండేషన్ ప్రతినిధి మురళి, ప్రిన్సిపాల్ డి.చంద్రకళ, వైస్ ప్రిన్సిపాల్ బి.నాగమణి, ఎం.ఈ.ఓ. జోగేంద్ర, ఎమ్మార్వో ఎస్.శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.




## టెక్కలి డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

**టెక్కలి సెప్టెంబర్ 11 జయ జయహే**

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎయిడ్స్ రుగ్మతలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సారధ్యంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి గోవిందమ్మ అధ్యక్షతన విద్యార్థులకు సమగ్రమైన ఎయిడ్స్ నివారణ అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించారు, ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ కౌన్సిలర్ నేతాజీ రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించి ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహనతో మెలగాలని సూచించారు, సాధారణంగా యువత పచ్చబొట్లు వేయించుకోవడం, అపరిచితుల రక్తాన్ని రోగులకు వినియోగించడం , సురక్షితము కానీ లైంగిక సంబంధాల వల్ల ఎయిడ్స్ వైరస్ వ్యాప్తించే ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాల గేయాల పోటీ ఫలితాలు

**డా.గజల్ శ్రీనివాస్**

**ఒంగోలు, సెప్టెంబర్ 11:( జయ జయహే)**



ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన "బాల గేయాలు" రచనా పోటీ ఫలితాలను పరిషత్తు అధ్యక్షులు, ప్రముఖ గాయకులు డా. గజల్ శ్రీనివాస్ ప్రకటించారు. 15 సంవత్సరాలలోపు బాలబాలికలు సులభంగా పాడుకునేలా, వారికి అర్ధమయ్యే సరళమైన పదాలతో, సందేశం, ఆత్మవిశ్వాసం, ఆనందం, విజ్ఞానం, వినోదం కలిగించే గేయాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పోటీని నిర్వహించినట్లు తెలిపారు. పోటీకి దేశ, విదేశాల నుంచి రచనలు అందాయని, న్యాయనిర్ణేతలు వాటిని పరిశీలించి ఉత్తమ రచనలను ఎంపిక చేసినట్లు సమన్వయ కర్త కోరుప్రోలు మాధవరావు తెలిపారు పోటీలో ప్రథమ బహుమతికి డాక్టర్ లక్ష్మి పవన్, మస్కట్, ద్వితీయ బహుమతికి కె. రవీంద్రకుమార్, హైదరాబాద్, తృతీయ బహుమతికి డాక్టర్ శ్రీదేవి శ్రీకాంత్, బోట్స్వానా ఎంపికయ్యారు. అలాగే వరలక్ష్మి యనమంద్ర, డాక్టర్ కర్రాటి లింగయ్య, జి.ఎల్.ఎస్. శర్మ, తంగి సన్యాసిరావు, ముప్పన ఈశ్వరరావు, జి. వేదవాణి, డాక్టర్ తోగట సురేష్ బాబు, డాక్టర్ డివిజి శంకరరావు, కె.వి. నారాయణరావ ఆకుల రఘురామయ్యలను ప్రోత్సాహక బహుమతులకు ఎంపిక చేశారు. పోటీలో పాల్గొన్న వారందరికీ అభినందన పత్రాలను అందజేయనున్నట్లు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. బాలల్లో తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి పెంపొందించడమే ఈ పోటీ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. విజేతలకు డిసెంబర్‌లో ఒంగోలు జరిగే బాలల ప్రపంచ తెలుగు మహా సభలలో బహుమతి ప్రదానం ఉంటుందని కార్యదర్శి రెడ్డప్ప ధవేజి తెలిపారు



## సత్యనారాయణరెడ్డి అరెస్టు
# కక్షసాధింపు చర్యే

**వైఎస్సార్‌సీపీ నేతల ఆరోపణ**

**నాయుడుపేట, సెప్టెంబర్ 11, జయ జయహే**

నాయుడుపేట పెళ్లకూరు మండలం చిల్లకూరులో జరిగిన ఘటనకు సంబంధించి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని అరెస్టు చేయడం కక్షసాధింపు చర్యేనని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. శుక్రవారం నాయుడుపేట ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడారు. ఈ సందర్భంగా సంజీవయ్య మాట్లాడుతూ ఘటనతో సంబంధం లేని వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా, సత్యనారాయణరెడ్డిపై హత్య కేసు నమోదు చేయడం సరికాదన్నారు. కేసుతో సంబంధం లేని మరో ఐదుగురిని అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తిప్పుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను అధికారులు, వైద్యులు స్పష్టంగా వెల్లడించాలని ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య డిమాండ్ చేశారు. అలాగే సూళ్లూరుపేట నియోజకవర్గంలో రేషన్ బియ్యం, మట్టి, గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాపై టీడీపీ నేతలు సమాధానం చెప్పాలని సంజీవయ్య డిమాండ్ చేశారు.



# కరువు మండలాలు ప్రకటించాలి

**రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా**

**వరదయ్యపాలెం, సెప్టెంబర్ 11, జయ జయహే**

వరదయ్యపాలెం వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నందున రాష్ట్రంలో వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. వరదయ్యపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఏఐకేఎస్, బీకేఎంయూ, కౌలు రైతు సంఘం, చేతివృత్తుల సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంభాకం చిన్ని రాజ్, ధనుంజయ శెట్టి మాట్లాడుతూ వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయారని తెలిపారు. ప్రభుత్వం రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం వెంటనే అందించాలని, రుణమాఫీ పరిమితిని రూ.2 లక్షలకు పెంచాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకుడు సింబెట్ మురళి, ధనుంజయ నాయుడు, డాక్టర్ రవి, సీపీఐ మండల కార్యదర్శి కృష్ణమూర్తి, కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




## వివిధ సమస్యలపై పాడేరు స్పందన కార్యక్రమంలో పిర్యాదు

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 11. జయ జయహే**

డుంబ్రిగూడ మండలం గసబ పంచాయతీ కూడ రెవెన్యూ గ్రామంలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలనీ జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ కి పిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కోసం5 గ్రామాల ప్రజలు సుమారు 20కిలోమీటర్ల దూరం లోగిలి డిపోలో వెళ్ళి రేషన్ తీసుకుంటున్నారనీ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ డిపో అందుబాటులో తీసుకొని రావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంటనే సమస్య పరిష్కారం చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా పోడు పట్టాలు మంజూరు చేయాలనీ దరఖాస్తు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ మెంబర్ పాంగి. గోపాల్, గెమ్మెలి. రామన్న, మర్రి. రామన్న, కొర్రా. రాజారావు,గెమ్మెలి. రఘునాధ్, హరిబాబు, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషకాహార మసోత్సవాలు



**బుచ్చియ్యపేట జయ జయహే**

వడ్డాది అంగన్వాడి కేంద్రం 1. పేద మదీనా . లో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ నిర్మల మాట్లాడుతూ అంగన్వాడి పరిధిలో సెప్టెంబర్ 7 నుండి అక్టోబర్ 7 వరకు ప్రతి ఏటా నెలరోజుల పాటు పోషకాహార మాస ఉత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా గర్భిణీలు ఎలా ఉన్నారు, బాలింతలు పోషకాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశం అని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకి తాజాగా వేడివేడి భోజనం అందించడం పోషకాహారాలు కూడిన పదార్థాలు అందించడం వంటివి నిర్మిస్తున్నామని అన్నారు. అంగన్వాడి పరిధిలో ఉన్న గర్భిణీ బాలింతలకు పి ఎం ఈ వై పథకం ద్వారాఅందచేస్తారని అన్నార ఈ కార్యక్రమం లో ఎన్జీవో ఈశ్వరరావు స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు బి వెంకటరావు అంగన్వాడి కార్యకర్తలు అమ్మాజీ మనీ వెంకటలక్ష్మి భాను వేణు వెంకటలక్ష్మి వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఆన్లైన్ దరఖాస్తు గడువు పెంచాలి

**అరకులోయ: సెప్టెంబర్ 11. జయ జయహే.**



అరకు వేలి మండలంలో మాదల పంచాయతీ పరిధిలో సుమారు 100,మంది వృదాప్య, వికలాంగులు,వితంతు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హత కల్గిన లబ్ధిదారులు సన్నద్ధం అవుతున్నారు, ఈ దరఖాస్తుదారులు పింఛన్ కీ ఆన్లైన్ చేయాలంటే కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఇంటి పన్ను కరెంట్ బిల్లు ఆధార్ కి లింక్ అయిన పోన్ నెంబర్ ఆధార్ హిస్టరీ ఓటర్ ఐడీ కార్డు తదితర ప్రూఫ్ లు తప్పని సరిగా పెట్టడం తో అర్హులైన పింఛన్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్టిఫికెట్ లు అందే అవకాశం లేదు, మారుమూల గ్రామాల్లో సిగ్నల్ , సర్వర్ సరిగా పని చేయకపోవడం వల్లన ఫోన్ లేని వారికి ఆధార్ తో లింక్ అయిన మొబైల్ నెంబర్,ఓటీపీలు రాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది ఇబ్బంది పడుతున్నారని ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కుమిలి రమేష్ డిమాండ్ చేశారు. సర్టిఫికెట్ లు అన్ని సమకూర్చుడానికి ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు, 12, 13, 14 తేదీలలో వరుస సెలవులు రావడంతో సకాలంలో సర్టిఫికెట్ లు రాకపోతే ఎంతోమంది అర్హులు అయిన నిరుపేద పింఛన్ లబ్దిదారులు కొత్త పింఛన్ పొందడానికి అర్హులు అయ్యి ఉండి కూడా పింఛన్ కోల్పోయే పరిస్థితి ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు, లబ్దిదారులకు ఇబ్బంది కలగకుండా పైన పేర్కొన్న సర్టిఫికెట్ ల సమస్యలన్నీ పరిష్కరించి అర్హులు అయిన ప్రతి పింఛన్ లబ్దిదారుడికి గుర్తించి కొత్త పింఛన్ అవకాశం కల్పించేలా ప్రభుత్వం సత్వరమే స్పందించి వెంటనే పింఛన్ దరఖాస్తు గడువు తేదీ ను పొడిగించాలని ప్రభుత్వనికి పై అధికారులకు డిమాండ్ చెయ్యడం జరుగుతుంది, ఈ కార్యక్రమానికి గిరిజన సంఘం మండల నాయకులు కుమిడి రమేష్, గోపాల్, ఆనంద్, సత్తిబాబు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు

## పింఛన్ ఆన్లైన్ గడువును పొడిగించాలి

**అరకులోయ: సెప్టెంబర్ 11. జయ జయహే.**




పింఛన్ ఆన్లైన్ గడువు పెంచాలని అల్లూరి జిల్లా బహుజన సమాజ్ పార్టీ అధ్యక్షులు శెట్టి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, మూడో శనివారం. ఆదివారం. సోమవారం. వినాయక చవితి వంటి సెలవు దినాలు దరఖాస్తుల గడువు మధ్యలో రావడంతో అందుబాటులో ఉన్న పని దినాలు తగ్గిపోయి అర్హులైన లబ్ధిదారులు తీవ్ర నష్టపోతారని అన్నారు. పెన్షన్ ఆన్లైన్ గడువును పొడిగించి ప్రతి సచివాలయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆయన కోరారు, వృద్ధులు వితంతువులు దివ్యాంగులు నిరుపేదలు కార్యాలయ చుట్టూ తిరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి దరఖాస్తులు స్వీకరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు, పండుగలు సెలవుల మధ్య దరఖాస్తులు చేసుకునే అవకాశం కోల్పోయి ఒక్క అర్హుడైన పెన్షన్ కు దూరమైతే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు అధికారులు ప్రజాల గోడును పట్టించుకుని వెంటనే గడువు పొడిగించాలని, అర్హులందరికీ న్యాయం జరిగేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు,



## ఆది దేవుడిని ఆనందంగా మట్టితో తయారుచేసి పూజిద్దాం!

**పర్యావరణాన్ని కాపాడుదాం ఈకో ఫ్రెండ్లీగా మారుదాం**

**ఋగ్వేదంలో గణపతి అనే పేరు పుట్టింది. అధర్వణవేదంలో గణపతి మంత్రం గా పెరిగింది పురాణాల్లో గణపయ్యగా స్థిరపడ్డాడు.**

**"గణానాం త్వాం గణపతిం హావమహే కవింకవీనా హావ మహహే" అనగా గణాలకు అధిపతి గణపతి అని అర్థము.**

వేదాలలో గణపతి అనగా మృణ్మయ ప్రతిమ అని అర్థము.మృణ్మయ అనగా మట్టి.ప్రతిమ అనగా ఆకృతి. మట్టితో చేసిన ఆకృతి. ఇతిహాసాల్లో పార్వతి దేవి ఒంటి నుండి వ్యర్థ విసర్జన మలిన పదార్ధము తో వినాయకుడి ప్రాణ ప్రతిష్ట జరిగింది. ఈ కథ కూడా మట్టి వినాయకుడిని పూజించమని మనకు సందేశాన్ని ఇస్తున్నది. ఇటువంటి మట్టితో తయారుచేసిన విగ్రహాన్ని కొనుగోలు చేసి పూజించడం వలన భూమికి పర్యావరణానికి ఎటువంటి కలుషితము జరగదు. రసాయనాలు, వివిధ రకాల రంగులు తో చేసిన విగ్రహాలు నిమజ్జనా సమయంలో నీటిని కలుషితం చేస్తున్నాయి. ప్రకృతిలో ఉన్న సహజసిద్ధంగా ఏర్పడిన మట్టితో విగ్రహాన్ని కుమ్మరి తయారు చేసి విక్రయించడం వలన వారి దగ్గర ప్రజలు కొనుగోలు చేయడం వలన వారికి ఆర్థికంగా తోడ్పాటు కూడా జరుగుతుంది. ఒకరికి చేయూతని అందించడం మన భారతీయ సనాతన సంస్కృతి. పి.ఓ.పి తో తయారు చేసిన వినాయక విగ్రహము నిమర్జనము చేసిన తర్వాత నీటిలో కరుగుటకు ఆరు మాసముల కాలం పడుతుంది. మట్టితో చేసిన వినాయక విగ్రహము నిమజ్జనానంతరం గంట సమయం లో నీటిలో కరిగిపోతుంది. ఈ విధంగా మట్టిని నీటిలో కలుపుట వలన చెరువులకు కూడా మేలు చేకూరుతుంది. ఈ సారవంతమైన మట్టి పంటలకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. మన గృహములో మన యొక్క పిల్లలు చేత మట్టి విగ్రహాలు తయారు చేయించి పూజించడం వలన పిల్లలు కూడా సంతృప్తిగా ఆనందంగా పూజ చేసుకుంటారు.పచ్చని ప్రకృతిలో లభ్యమయ్యే 21 రకాల గరికల తో మట్టితో చేసిన విగ్రహంతో, ప్రతి ఇంట్లో ఆనందంగా ఆది దేవుడిని పూజించుకుని వినాయక చవితిని జరుపుకుందాం. అందరికీ ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తో....

రచన
ఏ బాల సౌజన్యకుమారి
తెలుగు ఆచార్యులు
నంది అవార్డు గ్రహీత
ఆధ్యాత్మికవేత్త,ప్రవచనకర్త

# వికేంద్రీకృత, ఉపాధి ఆధారిత అభివృద్ధి జరగాలి

(ప్రతాప్)

**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. పరిపాలనకు శాశ్వత కేంద్రంగా, ఆధునిక మౌలిక వసతులతో కూడిన ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న సంకల్పం రాష్ట్ర భవిష్యత్తుకు కీలకం. దీర్ఘకాలంగా నిలిచిపోయిన రాజధాని నిర్మాణ పనులకు మళ్లీ ఊపునివ్వడం, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించడం రాష్ట్రంలో పెట్టుబడులు, ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలకు కొత్త అవకాశాలను తెరవగలదు. అయితే ఒక ముఖ్యమైన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలి---బలమైన రాజధాని అవసరం; కానీ బలమైన ఆంధ్రప్రదేశ్ కోసం రాజధానితో పాటు రాష్ట్రంలోని ప్రతి ప్రాంతం బలపడాలి.**



ఆంధ్రప్రదేశ్‌కు భౌగోళికంగా, ఆర్థికంగా విభిన్నమైన ప్రత్యేకతలు ఉన్నాయి. ఉత్తరాంధ్రకు ఓడరేవులు, సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలు, పర్యాటక సామర్థ్యం ఉన్నాయి. కోస్తాంధ్రకు వ్యవసాయం, ఆహార శుద్ధి, ఆక్వా రంగం, సముద్ర వాణిజ్యం వంటి బలాలు ఉన్నాయి. రాయలసీమకు పారిశ్రామిక స్థలాలు, సౌర--పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, ఖనిజ వనరులు, పర్యాటక అవకాశాలు ఉన్నాయి. ఈ ప్రాంతీయ బలాలను అనుసంధానించి ప్రత్యేక




ఆర్థిక అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దగలిగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మరింత విస్తృతమైన పునాది ఏర్పడుతుంది.

రాజధాని నిర్మాణం కేవలం ప్రభుత్వ భవనాల నిర్మాణంగా పరిమితం కాకూడదు. అమరావతి చుట్టూ రహదారులు, ప్రజా రవాణా, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, డిజిటల్ మౌలిక వసతులు అభివృద్ధి చెందాలి. అదే సమయంలో విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ--గుంటూరు, కాకినాడ, కర్నూలు వంటి నగరాలను వాటి ప్రత్యేక సామర్థ్యాలకు అనుగుణంగా అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. ఒకే నగరంపై ఒత్తిడి పెంచడం కంటే, అనేక నగరాలను పరస్పరం అనుసంధానించడం సమతుల అభివృద్ధికి బలమైన మార్గం.

పెట్టుబడుల ఆకర్షణలోనూ ఇదే దృక్పథం అవసరం. భారీ పరిశ్రమలు రావడం రాష్ట్రానికి మంచిదే. కానీ పెట్టుబడి పరిమాణం కంటే అది సృష్టించే ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి, స్థానిక వ్యాపారాలకు కలిగే ప్రయోజనం, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బలమైన పారిశ్రామిక వాతావరణం కల్పిస్తే స్థానిక యువతకు విస్తృత అవకాశాలు లభిస్తాయి.

వ్యవసాయ రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి భద్రత, వ్యవసాయ ఆధునీకరణ, పంటల విలువ పెంపు కూడా సమాన ప్రాధాన్యత పొందాలి. ఆహార శుద్ధి పరిశ్రమలు, నిల్వ సదుపాయాలు, శీతల గిడ్డంగులు, మార్కెటింగ్ వ్యవస్థలను బలోపేతం చేస్తే రైతు ఆదాయానికి మరింత స్థిరత్వం వస్తుంది. అలాగే సముద్రతీరం, నదులు, అటవీ ప్రాంతాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, చారిత్రక ప్రదేశాలను అనుసంధానించే పర్యాటక ప్రణాళిక రాష్ట్రానికి కొత్త ఆదాయ వనరులను సృష్టించగలదు.

అభివృద్ధి అంటే కేవలం కొత్త భవనాలు, రహదారులు, పరిశ్రమలు కాదు. ప్రతి జిల్లాలో నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి, తాగునీరు, రవాణా, డిజిటల్ సదుపాయాలు అందుబాటులో ఉండటం కూడా అభివృద్ధే. అందుకే జిల్లా స్థాయిలో అభివృద్ధి సూచికలను రూపొందించి, ఏ ప్రాంతం ఏ రంగంలో ముందుంది, ఎక్కడ వెనుకబడి ఉంది అన్నదాన్ని నిరంతరం కొలవాలి.

అమరావతి రాష్ట్రానికి పరిపాలనా హృదయంగా ఎదగాలి. విశాఖపట్నం పారిశ్రామిక--సముద్ర ఆర్థిక కేంద్రంగా, తిరుపతి జ్ఞాన--ఆధ్యాత్మిక--పర్యాటక కేంద్రంగా, రాయలసీమలోని నగరాలు పరిశ్రమ--ఇంధన కేంద్రాలుగా, కోస్తా ప్రాంతాలు వ్యవసాయ--ఆహార--సముద్ర ఆర్థిక కేంద్రాలుగా ఎదగాలి. ఇలా పరస్పరం పోటీ పడే నగరాలు కాదు, పరస్పరం బలపరిచే అభివృద్ధి కేంద్రాలుగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలి.

అమరావతి నిర్మాణం ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి ఒక గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. ఆ అవకాశాన్ని ఒక రాజధాని నిర్మాణానికే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా సమతుల, వికేంద్రీకృత, ఉపాధి ఆధారిత అభివృద్ధికి పునాదిగా మార్చడం ఇప్పుడు ప్రభుత్వ ముందున్న అసలు పరీక్ష. రాజధాని రాష్ట్రానికి దిశ చూపాలి; కానీ ఆ దిశలో ప్రయాణించే అభివృద్ధి రథం శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు, విశాఖ నుంచి కర్నూలు వరకు ప్రతి ప్రాంతాన్నీ వెంట తీసుకెళ్లినప్పుడే ఆంధ్రప్రదేశ్ నిజమైన ప్రగతి రాష్ట్రంగా అవతరిస్తుంది.



# నీటి భద్రత కోసం మెరుగైన ప్రణాళికలు

(ప్రతాప్)

**ఒక దేశ భవిష్యత్తును నిర్ణయించేది కేవలం ఆర్థిక వృద్ధి రేటు కాదు. ఆ వృద్ధికి ఆధారమైన సహజ వనరులను ఎంత సమర్థంగా కాపాడుకుంటుందన్నదీ అంతే ముఖ్యం. ఆ వనరుల్లో నీటిదే అగ్రస్థానం. అన్నం పండాలన్నా, పరిశ్రమలు నడవాలన్నా, నగరాలు విస్తరించాలన్నా, ప్రజారోగ్యం మెరుగుపడాలన్నా నీరు కావాలి. అందుకే నీటి సంక్షోభం ఇక పర్యావరణ సమస్య మాత్రమే కాదు; అది ఆహార భద్రత, ఆర్థిక భద్రత, ప్రజారోగ్యం, సామాజిక స్థిరత్వంతో ముడిపడిన జాతీయ భద్రతా అంశం.**



భారత్ ఎదుర్కొంటున్న సవాలు నీరు పూర్తిగా లేకపోవడం కాదు; ఉన్న నీటిని సమయానికి, సమర్థంగా, సమానంగా వినియోగించుకోలేకపోవడమే. కేంద్ర జల సంఘం తాజా అంచనాల ప్రకారం 2021లో దేశ సగటు వార్షిక తలసరి నీటి లభ్యత 1,573 ఘన మీటర్లు. సాధారణంగా 1,700 ఘన మీటర్ల కంటే తక్కువ లభ్యతను నీటి ఒత్తిడి పరిస్థితిగా పరిగణిస్తారు. జనాభా పెరుగుదలతో ఈ లభ్యత మరింత తగ్గే అవకాశం ఉన్నందున, భవిష్యత్ అవసరాలను ఇప్పటి నుంచే దృష్టిలో పెట్టుకోవాలి.

ఇదే సమయంలో భూగర్భజలాలపై ఆధారపడటం ప్రమాదకర స్థాయికి చేరుతోంది. 2025 అంచనాల ప్రకారం దేశంలో వార్షిక భూగర్భజల వెలికితీత 247.22 బిలియన్ ఘన మీటర్లు కాగా, వెలికితీయదగిన వనరులతో పోలిస్తే మొత్తం వెలికితీత స్థాయి 60.63 శాతంగా ఉంది. 6,762 అంచనా విభాగాల్లో 730 విభాగాలు ఇప్పటికే 'అతిగా వినియోగించిన' కేటగిరీలో ఉన్నాయి. అంటే భవిష్యత్తు తరాలకు దాచాల్సిన భూగర్భ జలాన్ని మనం వర్తమాన అవసరాల కోసం వేగంగా ఖర్చు చేస్తున్నామన్నమాట.

ఈ సమస్యకు కేంద్రబిందువు వ్యవసాయమే. గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం నీటి వినియోగంలో వ్యవసాయ వాటా 80--90 శాతం వరకు ఉందని నీతి ఆయోగ్ పేర్కొంది. కాబట్టి నీటి భద్రత సాధించాలంటే రైతుపై ఆంక్షలు విధించడం కాదు; తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించే వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం ముఖ్యం. సూక్ష్మ సేద్యం, పంటల వైవిధ్యం, ప్రాంతానికి అనుకూలమైన పంటల ఎంపిక, నీటి పొదుపు సాంకేతికతలు, సమర్థవంతమైన కాలువల నిర్వహణకు పెద్దపీట వేయాలి.

పట్టణ భారతదేశం కూడా మరో కీలక సవాలును ఎదుర్కొంటోంది. జనాభా, గృహ నిర్మాణం, పరిశ్రమలు పెరుగుతున్న కొద్దీ తాగునీటి డిమాండ్ పెరుగుతోంది. అయితే నగరాల్లో వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా వేగంగా బయటకు వెళ్లిపోవడం, చెరువులు ఆక్రమణలకు గురికావడం, శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించకపోవడం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. ప్రతి నగరానికి నీటి లభ్యత, వినియోగం, నష్టం, పునర్వినియోగం ఆధారంగా వార్షిక నీటి బడ్జెట్ రూపొందించడం ఇక ఐచ్ఛికం కాకూడదు.

అలాగే ప్రతి గ్రామం తన వర్షపాతం, భూగర్భజల స్థాయి, సాగు అవసరాలు, స్థానిక జలవనరుల ఆధారంగా నీటి బడ్జెట్ రూపొందించుకోవాలి. చెరువులు, కుంటలు, కాలువలు, వాగులు వంటి సంప్రదాయ జలవనరుల పునరుద్ధరణకు స్థానిక సంస్థలను బాధ్యత వహించేలా చేయాలి. వర్షపు నీటి సంరక్షణను భవన నిర్మాణ నిబంధనగా మాత్రమే కాకుండా ప్రజా ఉద్యమంగా మార్చాలి.నీటిని ఆదా చేయడమే కాకుండా వాడిన నీటిని తిరిగి వినియోగించడం కూడా భవిష్యత్తు జల విధానంలో ప్రధాన భాగం కావాలి. శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలు, ఉద్యానవనాలు, నిర్మాణ రంగం, ఇతర తాగునీరు అవసరం లేని అవసరాలకు మళ్లిస్తే మంచినీటిపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది. నదుల విషయంలోనూ ఇదే సమగ్ర దృక్పథం అవసరం. నదిని కేవలం నీటిని తరలించే మార్గంగా కాకుండా, దాని పరీవాహక ప్రాంతం, భూగర్భజలాలు, జీవవైవిధ్యంతో కూడిన జీవవ్యవస్థగా పరిరక్షించాలి.

వాతావరణ మార్పు ఈ సవాలును మరింత సంక్లిష్టం చేస్తోంది. ఎక్కడో అతివృష్టి, మరెక్కడో దీర్ఘకాలిక వర్షాభావం, ఇంకెక్కడో ఆకస్మిక వరదలు---నీటి లభ్యతలో తీవ్ర అసమానతలు ఏర్పడుతున్నాయి. కాబట్టి వరదనీటిని కేవలం ముప్పుగా చూడకుండా, దానిని నిల్వ చేసి భూగర్భజలాలను పునర్భర్తీ చేసే అవకాశంగా మార్చాలి.

నీరు రాష్ట్రాల పరిధిలోని అంశమైనప్పటికీ దాని ప్రభావం జాతీయమైనది. అంతర్రాష్ట్ర నదీ వివాదాలను తాత్కాలిక రాజకీయ రాజీలతో కాకుండా నదీ పరీవాహక ప్రాంతాన్ని ఒక సమగ్ర యూనిట్‌గా పరిగణించి, శాస్త్రీయ సమాచారం ఆధారంగా దీర్ఘకాలిక పరిష్కారాలు కనుగొనాలి. కేంద్రం--రాష్ట్రాలు--స్థానిక సంస్థలు--ప్రజలు కలిసి పనిచేసే సమన్విత జల పరిపాలన అవసరం.

నీటి భద్రత కోసం ఇక 'ఎక్కడి నుంచి ఎక్కువ నీరు తెచ్చుకోవాలి?' అనే ప్రశ్న కంటే 'ఉన్న నీటిని ఎలా పొదుపు చేయాలి, పునర్వినియోగించాలి, భవిష్యత్తుకు ఎలా భద్రపరచాలి?' అనే ప్రశ్నకు సమాధానం వెతకాలి. ప్రతి గ్రామానికి నీటి బడ్జెట్, ప్రతి నగరానికి పునర్వినియోగ ప్రణాళిక, ప్రతి రైతుకు నీటి సామర్థ్య సాంకేతికత, ప్రతి జలవనరుకు సంరక్షణ---ఇవన్నీ కలిసినప్పుడే జల భద్రత సాధ్యమవుతుంది. దేశ ఆర్థిక ప్రగతికి పునాది వేసే ప్రతి రంగం వెనుక నీరే ఉంది. అందుకే రేపటి భారత భద్రతను కాపాడే అతి పెద్ద పెట్టుబడి కొత్త జలవనరును వెతకడం కాదు---ఈరోజు మన చేతిలో ఉన్న ప్రతి చుక్కను కాపాడడమే.




# ఘనంగా సంస్మరణ దినోత్సవం

## అటవీ అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్11, జయ జయహే

శ్రీకాళహస్తి: అడవులు, వన్యప్రాణులు, ప్రకృతి సంపద పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అమరులైన అటవీ శాఖ అధికారులు, సిబ్బంది త్యాగాలు చిరస్మరణీయమని శ్రీకాళహస్తి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. లోకేష్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి అటవీ రేంజ్ పరిధిలో శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎఫ్.ఆర్. ఓ పి. లోకేష్ మాట్లాడుతూ.. అటవీ సంరక్షణ కోసం అమరవీరులు చూపిన ధైర్యం, అంకితభావం, సేవా స్ఫూర్తి నేటి అటవీ సిబ్బందికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమన్నారు. అడవులను అక్రమ ఆక్రమణలు, స్మగ్లింగ్, వన్యప్రాణుల వేట వంటి అక్రమ కార్యకలాపాల నుంచి కాపాడటంతో పాటు అటవీ సంపద అభివృద్ధి, పరిరక్షణకు శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని అటవీ సంరక్షణలో మరింత అంకితభావంతో విధులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం అటవీ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొని అమరవీరుల సేవలను స్మరించుకున్నారు. అడవుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన అటవీ అమరవీరుల త్యాగం.. తరతరాలకు స్ఫూర్తిదాయకం అని ఎఫ్.ఆర్. ఓ పి. లోకేష్ పేర్కొన్నారు.

# శారదా నది ఘాటును పరిశీలించిన ఎమ్మెల్యే రామకృష్ణ

**అనకాపల్లి జయ జయహే**

వినాయక చవితి వస్తున్న సందర్భంగా వినాయక చవితి పర్వతను అనంతరం నిర్వహించిన వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తావు లేకుండా జరగాల అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పగడబందిగా వినాయక నిమజ్జనాలు జరుగు నది వద్ద ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రామకృష్ణ అధికారులకు సూచించారు అనకాపల్లి లో వినాయక విగ్రహాల నిమజ్జనం నిర్వహించే ప్రధాన ప్రాంతమైన శారదా నది నిమజ్జన ఘాటును ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని దానికి తగిన అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచనలు చేస్తూ నది ఈ ప్రాంతం అంత ఆయన కలియ తిరగడం జరిగింది ఈ సందర్భంగా జీవీఎంసీ పోలీసు రెవెన్యూ విద్యుత్ పారిశుధ్య తదితర శాఖల అధికారులతో సమన్వెంత పనిచేయాలని నిమజ్జనానికి వచ్చే భక్తులు యువత మహిళలు చిన్నారుల భద్రతను ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఘాటు పరిసరాల్లో తగినంత వెలుతురు తగిన సౌకర్యాలు మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు సూచించడం జరిగింది నిమజ్జన సమయంలో భారీగా భక్తులు తరలు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ వాహనాలు పార్కింగ్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీసులకు ఆయన ఆదేశాలు ఇవ్వడం జరిగింది ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ వాహనాలు పార్కింగ్ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టి పెట్టాలని అలాగే నదిలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేసేటప్పుడు పోలీసుల ప్రత్యేక దృష్టి ఆ వైపు పెడుతూ గమనించాలని ప్రమాదవశాత్తు ఎవరైనా నదిలో జారిపోతాయి దానికి తగ్గ ముందస్తు ప్రణాళికతో వారిని రక్షించుటకు



సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు నదిలో నీటి ప్రవాహము ఎక్కువగా ఉన్నప్పుడు నదిలోకి లోతుగా వెళ్లకుండా అవసరమైన భద్రత చర్యలు చేపట్టాలని అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనేదిగా సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు అదేవిధంగా నదిలో చెత్తాచెదారం వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పారిశుధ్య సిబ్బంది నది వద్ద అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు ఈ వినాయక నిమజ్జన కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మికంగా ఆనందాన్ని కలిగించే విధంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు సమన్వెంత పనిచేయాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి పోలీస్ అధికారులు ఇతర శాఖల సిబ్బంది కూటమి నాయకులు స్థానిక నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్లాస్టిక్‌పై దాడులు..

## 10 కిలోల నిషేధిత ప్లాస్టిక్ స్వాధీనం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి :**

నిడదవోలు మున్సిపాలిటీ పరిధిలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం, విక్రయాలపై మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లను వినియోగించకూడదని, విక్రయించకూడదని అధికారులు సూచించారు. పట్టణంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు 10 కిలోల నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.2,000 జరిమానా విధించి వసూలు చేశారు. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని వ్యాపారులకు, ప్రజలకు సూచించారు. ఈ తనిఖీల్లో డి. దావీదు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, అమిరాజు, పోసిబాబు, గణపతి, మేస్త్రి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు. పట్టణ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించినా, విక్రయించినా నిబంధనల ప్రకారం జరిమానాలు విధించి చర్యలు తీసుకుంటామని డి. దావీదు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.





## నిడదవోలు 32 వార్డుల పోలింగ్ కేంద్రాల హద్దులు 15న పరిశీలన

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోని 32 వార్డులకు సంబంధించి పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ 10న ప్రచురించారు. శ్రీయుత కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, ఏపీ, రాయపూడి వారి సర్క్యులర్ నెం. 13021/201/2026/జుశ్రీవషె-×-3-2, తేదీ 08-09-2026 ప్రకారం, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుమతితో ఈ ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు సెప్టెంబర్ 11న ఉదయం 11 గంటలకు నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సంబంధిత సెక్రటరీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి వార్డు హద్దులను భూమిపై ప్రత్యక్షంగా చూపించాలని కోరారు. వారి సూచన మేరకు సెప్టెంబర్ 15వ తేదీ మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిడదవోలు పురపాలక సంఘంలోని 32 వార్డుల హద్దులను భూమిపై చూపించే కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, సంబంధిత సెక్రటరీలు హాజరై సహకరించాలని అధికారులు తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలకు సన్నద్ధం కావాలని నాయకులు సూచించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయంలో పట్టణ కమిటీ సభ్యులు, వార్డు ఇన్‌చార్జిలు, వీర మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా రానున్న మున్సిపల్ ఎన్నికలకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం, ప్రతి వార్డులో పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య సమన్వయం పెంచడం, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై చర్చించారు. ప్రతి వార్డులో పార్టీ పరిస్థితిపై సమీక్ష నిర్వహించి, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వార్డు ఇన్‌చార్జిలు తమ పరిధిలోని కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా వీర మహిళలు కూడా పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని మహిళలు, కుటుంబాలతో విస్తృతంగా సంబంధాలు ఏర్పరచుకోవాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సమావేశంలో పేర్కొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటిని




సంబంధిత నాయకుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి అవసరమైన కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీ సభ్యులు, వివిధ వార్డుల ఇన్‌చార్జిలు, వీర మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## వీఎంఆర్‌డీఏ ఓపెన్ ఫోరంకు అన్యూహ్య స్పందన

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్‌డీఏకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్నసమస్యలకు సత్వర పరిష్కరమార్గం చూపేందుకు వీఎంఆర్‌డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ కేతన్ గార్గ్ నేతృత్వంలో నిర్వహించిన ఓపెన్ ఫోరంకు అన్యూహ్య స్పందన లభించింది. శుక్రవారం ఉదయం వీఎంఆర్‌డీఏ కార్యాలయం 9వఅంతస్తు సమావేశమందిరంలో నిర్వహించిన ఓపెన్ ఫోరంకు వీఎంఆర్‌డీఏ పరిధిలోని అర్జీదారులు తమ వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్నసమస్యలకు పూర్తిస్థాయిలో పరిష్కరం చూపాలని అర్జీదారులు అధికారులను కోరారు. వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్ఈ వినయ్‌కుమార్, ఎస్టేటు అధికారి దయానిధి, సీయూపీ దివ్య, అదనపు కార్యదర్శి రుషిబాబు, డీఎఫ్ఓ ఎ.వి.రమణమూర్తితోపాటు పలువురు పరిపాలనా అదికారులు, ప్రణాళికాదికారులు, ఇంజనీరింగ్ అదికారులు పాల్గొని అర్జీదారుల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు పరిష్కరించగలిగిన వాటిపై తక్షణ చర్యలు చేపట్టాలని కార్యదర్శిశ్రీ మురళీకృష్ణ అధికారులను ఆదేశించారు. తదుపరి పరిశీలన అవసరమైన దరఖాస్తుల విషయంలోనూ అనవసర జాప్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టి పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు



## లుబ్బర్తి ఉపాధ్యాయురాలుకి ఘన సన్మానం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 11,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం చింతలపూడి పంచాయతీ పరిధిలోని లుబ్బర్తి గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా సేవలందిస్తున్న రామలక్ష్మికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించిన సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొయ్యూరు మండల విద్యాశాఖ అధికారి హాజరయ్యారు. పాఠశాల చైర్మన్ తుబే వికాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొని రామలక్ష్మిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి విద్యాభివృద్ధికి రామలక్ష్మి చేస్తున్న కృషిని పలువురు కొనియాడారు.



## కంపరేగుల గ్రామానికి చెక్ డ్యామ్ మంజూరు చేయండి..

**ఐటీడీపీ కోఆర్డినేటర్ జంపా వెంకటరమణ విజ్ఞప్తి..**

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 12**

అల్లూరి జిల్లా నడింపాలెం పంచాయతీ పరిధిలోని కంపరేగుల గ్రామంలో తెగునుపాటు గెడ్డ వద్ద చెక్ డ్యామ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఐటీడీపీ కోఆర్డినేటర్ జంపా వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. తెలుగుదేశం పార్టీ ప్రతి వారం నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే శ్రీమతి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో గిడ్డి ఈశ్వరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ఈ విజ్ఞప్తి చేశారు. పుష్కలమైన నీటి వనరులు ఉన్నా భూములు బీడుబారే దుస్థితి ఏర్పడిందని, ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు లేక భూములు బీడువారి ఉన్నాయని తెలిపారు. కంపరేగుల గ్రామంలో తెగునుపాటు గెడ్డ వద్ద చెక్ డ్యామ్ నిర్మిస్తే దాదాపు 200 ఎకరాలు నిత్యం సాగులో ఉంటుందని, కంపరేగుల, శరభన్న పాలెం, బట్టు మెట్ట గ్రామాల రైతులకు మేలు కలుగుతుందని అన్నారు.

## ఎంపీటీసీ సెగ్మెంట్ల వారీగా ఫోటో ఓటర్ల జాబితా ప్రచురణ..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 12,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ సెగ్మెంట్ల వారీగా ఫోటోతో కూడిన ఓటర్ల జాబితా ప్రచురించారు. మండలంలోని అన్ని ఎంపీటీసీ సెగ్మెంట్లకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. తమ పేర్లు, వివరాలు సరిచూసుకోవాలని, తప్పులు ఏమైనా ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ జాబితాను ప్రజలు, ప్రజా ప్రతినిధులు పరిశీలించవచ్చు అని అన్నారు.



# నిడదవోలులో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలి: జువ్వల రాంబాబు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



నిడదవోలు మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలని నిడదవోలు మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) గౌరవ అధ్యక్షులు, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను కమిషనర్ దృష్టికి జువ్వల రాంబాబు తీసుకువచ్చారు. నిడదవోలు పట్టణంలోని పారిశుధ్య కార్మికులు, రెల్లి కుటుంబాల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి స్థలం కేటాయించడంతో పాటు బడ్జెట్ మంజూరు చేయాలని కోరారు. మున్సిపల్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య పనులను స్థానికులకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కోవిడ్ సమయంలో అదనంగా విధులు నిర్వహించి ప్రజలకు సేవలందించిన పారిశుధ్య కార్మికుల్లో పలువురికి ఇంకా జీతాలు చెల్లించలేదని, వారికి సంబంధించిన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. నిడదవోలు మున్సిపాలిటీ 28 వార్డుల నుంచి 32 వార్డులకు విస్తరించి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా హోదా పెరిగినందున అన్ని విభాగాల్లో సిబ్బంది సంఖ్యను పెంచాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులకు క్రమం తప్పకుండా కొబ్బరి నూనె, సబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో టీ. చిరంజీవి, బి. నాగేశ్వరరావు, బి. సాయిరమణ, కొండ భవాని, అనూష, వెంకటలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# వేంగడలో భూ రీ సర్వే ప్రజలు సంతోష వ్యక్తం

**అనంతగిరి: సెప్టెంబర్ 11. జయ జయహే.**

మండలంలోని వేంగడ గ్రామంలో స్వాతంత్రం వచ్చి 79, 80 ఏళ్ళు తరువాత రీసర్వే బృందం రావడంతో స్థానిక ప్రజలు ఆనందంతో సంతోష వ్యక్తం చేశారు, ఈ సందర్భంగావి ఆర్ ఓ రాంబాబు మాట్లాడుతూ,ప్రభుత్వం చేపట్టిన భూమి రి సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు, ప్రజలందరూ భూ రీ సర్వే సద్వినియోగం చేసుకోవాలని భూమి పట్టాలు అందరికీ వస్తే రైతు భరోసా పిఎం కిసాన్ లాంటి స్కీములు ప్రజలకు అందుతాయని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మజ్జి మత్యారాజు, కొంతేరి రామనాయుడు మాజీ వైస్ సర్పంచ్, మజ్జి గోవింద్ వార్డు మెంబర్, గోవింద్ సేల్స్ మెన్, మజ్జి భీమన్న వార్డు మెంబర్, ఎండి కేశవ్ వార్డు మెంబర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు,



# రోలుగుంట పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్‌లో భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

**చోడవరం సెప్టెంబర్ 11 జయ జయహే**

నర్సీపట్నం నవ్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో, లయన్ పి.వి.ఎం. నాగజ్యోతి సహకారంతో రోలుగుంటలోని పీఎం శ్రీ జడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం భారీ ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నవ్య లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు బి. విజయకుమార్, సతీష్, ప్రస్తుత ట్రెజరర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు పాఠశాల ప్రాంగణాన్ని పచ్చదనంతో నింపడం, విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన, బాధ్యతను పెంపొందించడం లక్ష్యంగా సుమారు 200 మొక్కలను నాటారు. వీటిలో మామిడి, సపోటా, శీతాఫలం, నేరేడు తదితర పండ్ల మొక్కలు ఉన్నాయి. పాఠశాల ప్రాంగణంతో పాటు పరిసర ప్రాంతాల్లో, రహదారికి ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




# డిగ్రీకళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

**చోడవరం, సెప్టెంబర్ 10, జయ జయహే**

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఆంధ్రప్రదేశ్ టే స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొ రేషన్ ఆధ్వర్యంలో చోడవరం ప్రభుత్వ డిగ్రీకళాశాలలోని స్కిల్ హబ్లో " ఇట్ హెల్ప్ డెస్క్ అటెండెంట్ కంప్యూ టర్ కోర్సు శిక్షణ కార్యక్రమం ప్రారంభ్మై మంది. మూడు నెలల వ్యవధిగల ఈ కోర్సు లోశిక్షణతో పాటు సర్టిఫికేషన్ను పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే కిరణ్ కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లా డుతూ, నేటిపోటీప్రపంచంలో కంప్యూ టర్ సాంకేతిక నైపుణ్యా లుయువతకు ఎంతో అవసరమని అన్నారు. విద్యతో పాటు ఉద్యోగానికిఅవసర్మై మన నైపుణ్యా లను అభివృద్ధిచేసుకోవడం ద్వా రా విద్యా ర్థు లు మెరుగైన ఉపాధిఅవకాశాలను పొందవచ్చని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణను ప్రతి విద్యా ర్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కిల్ హబ్ ఇంచార్జ్ జి రాజ్ కుమార్ మాట్లా డుతూ, ప్రస్తు త ఉద్యోగ మార్కెట్లో కంప్యూ టర్ ఐటీ సంబంధిత నైపుణ్యా లకు మంచిడిమాండ్ ఉందని తెలిపారు. పిఎంకెవివై.. ఏపీ ఎస్ ఎస్ డి సి ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్న ఈ శిక్షణ ద్వారా యువతలో ఉద్యోగ నైపుణ్యా లను పెంపొందించడంతో పాటువారిని ఉపాధిఅవకాశాలకు సన్నద్ధం చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొ న్నారు. శిక్షణార్థులు క్రమశిక్షణతో శిక్షణను పూర్తి చేసి, పొందిన నైపుణ్యా లను తమభవిష్యత్ కెరీర్లో ఉపయోగించుకోవాలని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో స్కిల్ హబ్ ట్రైనర్ వై మౌనిక, విద్యా ర్థు లు శిక్షణార్థు లు పెద్దసంఖ్యలో పాల్గొ న్నా రు. శిక్షణ కార్యక్రమంలో భాగంగావిద్యా ర్థు లకు కోర్సు వివరాలు, శిక్షణ విధానం నైపుణ్యా భివృద్ధిఅవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం "కోర్సు కు సంబంధించిన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.





# బుల్లయ్యలో మట్టి గణపతుల పోటీ

**విశాఖపట్నం, సెప్టెంబర్ 11, జయ జయహే**

స్థానిక డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శుక్రవారం డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు (ఎకో ఫ్రెండ్లీ) పర్యావరణ హిత గణపతి మట్టి బొమ్మలు పోటీ జరిగింది. ఈ పోటీలో బి ఏ, బి కాం, బిఎస్సీ, బి బి ఏ మూడు సంవత్సరాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంతో పాల్గొని వివిధ ఆకృతులలో గణపతి మట్టి బొమ్మలు చేసారు. బి కాం ప్రథమ సంవత్సరం చదువుతున్న యాస్మిన్ అహ్మద్ రెండు అంగుళాల పరిమాణంలో గణపతిని చేసి అందరి ప్రశంసలు పొందారు. ఈ కార్యక్రమం కళాశాల పర్యావరణ శాస్త్ర విభాగం నిర్వహణలో భాగమైన గ్రీన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్. బి.మాధవి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రీన్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా జి ఎస్ కె చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డా పి.సురేఖ విద్యార్థులను వారి అపూర్వ సృష్టిని అభినందించారు. అనంతరం విజేతలను ఎంపిక చేశారు.



# కొత్తకోట కాలనీల్లో మంచినీటి సమస్యకు త్వరలో పరిష్కారం

**చోడవరం సెప్టెంబరు 11 జయ జయహే**

రావికమతం మండలం కొత్తకోట మేజర్ పంచాయతీలోని అరుంధతి కాలనీ, అంబేద్కర్ కాలనీలలో నివసిస్తున్న వందలాది ప్రజలకు అనేక సంవత్సరాలుగా సక్రమంగా మంచినీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్నిసార్లు పూర్తిగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యను 'మన గ్రామం--మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతి ఇంటి సభ్యులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమకు సక్రమంగా మంచినీటి సరఫరా చేయాలని ముక్తకంఠంతో కోరారు. ప్రజల ప్రధాన సమస్యను ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన పంచాయతీరాజ్ కమిషనర్ కి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం పంచాయతీరాజ్ కమిషనర్ జిల్లా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అయితే ప్రతిపాదనలు సిద్ధం కావడంలో ఆలస్యం జరుగుతుండటంతో, ఈ నెల 9వ తేదీన విజయవాడలో రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ ని పీవీఎస్ఎన్ రాజు మరోసారి కలిసి సమస్యను ప్రస్తావించారు. దీంతో కమిషనర్ జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గారికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి , ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ , ఇతర ఇంజనీరింగ్ అధికారులు కలిసి కొత్తకోట గ్రామంలోని అరుంధతి, అంబేద్కర్ కాలనీలను సందర్శించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. త్వరలోనే మంచినీటి సరఫరా పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు తమ సమస్యను పరిష్కరించేందుకు ఆదేశాలు ఇచ్చిన ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికి , తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరం శాసనసభ్యులు కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, చోడవరం జనసేన పార్టీ ఇంచార్జి పీవీఎస్ఎన్ రాజు, చోడవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం మాధవి రామ అప్పారావు, మహిళా అధ్యక్షురాలు నందవరపు రమాదేవి, మండల పార్టీ అధ్యక్షులు మైచర్ల నాయుడు, బలిజి మహారాజు, డి.ఎస్. నాయుడు, ప్రోగ్రాం కమిటీ కన్వీనర్ గుండు గణేష్, సీనియర్ నాయకులు గండి సింహాద్రి, పచ్చికుర గోవిందరావు, శనివాడ నాయుడు బాబు, టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరరావు, మండల ప్రధాన కార్యదర్శులు లొట్ల శివ, ఉగ్గిన గోవిందరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాలకు చోడవరం పోలీస్ శాఖ పటిష్ట చర్యలు

**చోడవరం సెప్టెంబర్ 11 జయ జయహే**

వినాయక చవితి ఉత్సవాలనుప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీఐ అప్పలరాజు, ఎస్ ఐ నాగకార్తీక్ , జోగారావు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూజిల్లా వ్యాప్తంగా గణేష్ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో ఆన్‌లైన్ అనుమతి విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. మండపాల నిర్వాహకులు ఇక వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గణేష్ ఉత్సవ. నెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులో మండపం ఏర్పాటు చేసే ప్రాంతం, విగ్రహం సైజు, మండపం వివరాలు, ఉత్సవ కమిటీ సభ్యుల వివరాలు, నిమజ్జనం తేదీ, సమయం, రూట్ తదితర వివరాలను నమోదు చేయాలన్నారు. దరఖాస్తు అనంతరం సంబంధిత అధికారులు మండపం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తారన్నారు. నిబంధనలు సక్రమంగా ఉన్నట్లయితే క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌ఓసి ఆన్‌లైన్‌లో జారీ చేస్తారు. ఈ అనుమతి ప్రక్రియకు ఎలాంటి రుసుము లేదని పోలీస్ శాఖ స్పష్టం చేసింది. మండపాల నిర్వాహకులు అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, విద్యుత్ వైర్లు సురక్షితంగా ఏర్పాటు చేయాలి. ప్రజలకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఉత్సవాల సమయంలో అసాంఘిక కార్యకలాపాలకు, మద్యం సేవించి ఊరేగింపుల్లో పాల్గొనడానికి తావివ్వకూడదని పోలీసులు సూచిస్తున్నారు. డీజేలు, మైకులు, ఊరేగింపులు తదితర అంశాల్లో పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోరుతున్నారు. చోడవరం నియోజకవర్గంలో కూడా గణేష్ ఉత్సవ కమిటీలు ముందస్తుగా అనుమతులు తీసుకుని, పోలీసులకు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# ఎల్ నినో దృష్ట్యా మెట్ట ప్రాంతాన్ని కరువు మండలాలుగా ప్రకటించాలి

**సీపీఐ అనుబంధం సంఘం.. బి కె ఎం యూ డిమాండ్**

**జంగారెడ్డిగూడెం-జయ జయహే**

భారత్ కేత్ మజ్దూ ర్ యూయూనియన్ (బి కే యం యు) ఆధ్వర్యంలో , రైతు, కౌలు రైతు సంఘాలు, చేతి వృత్తి దారుల సంఘాలు తలపెట్టిన రాష్ట్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసారు. అనంతరం తహసిల్దార్ కె ఎస్ జోజీ డిమాండ్ లతో కూడిన వినతి పత్రాన్ని నాయకులు సమర్పించారు. జిల్లా సహాయ కార్యదర్శి గోలీమే బాల యేసు, సిపిఐ మండల సహాయ కార్యదర్శి సుంకర రాధాకృష్ణ (బాబు) మాట్లాడుతూ ఎల్ ని నో ప్రభావం వల్ల ఏడాది వర్షాలు లేక వ్యవసాయం 70శాతంకుంటూ పడింది అన్నారు. సాగు చేయక పోవటం వల్ల రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్ కూలీలకు, చేతి వృత్తిదారులకు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనితెలిపారు. రాష్ట్రంలో ఏర్పడ్డ విపత్కర పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి రాష్ట్రానికిచే యూ త నివ్వాలని ఎ వారు డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు మరియు చేతి వృత్తి దారులకు చెందిన పాత రుణాలను రద్దుచేసి కొత్త రుణాలు మంజూరు చేయాలని వారు కోరారు. వ్యవసాయ కూలీలకు తక్షణమే ఉపాధి హామీ పనులను కల్పించి, రోజు కూలి రూ 700 ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి లేని గ్రామీణ పట్టణ ప్రజానీకానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 16 రకాల నిత్యావసర వస్తువులను ఉచితంగా పంపిణీ చేయాలనివిజ్ఞప్తి చేశారు. కరువు పించన్ కింద నెలకు పదివేలు పెన్షన్ ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలురైతులు , చేతి వృత్తి దారుల సంఘాల నాయకులు చిత్తూరు గంగాధర్ రావు, కుంచె నాగేంద్ర, గుదే ఆశీర్వాదం, జి స్వప్న, జగన్నాథ కృష్ణ, గోలిమే రమేష్మోదలుగు వారు పాల్గొన్నారు.

# రాజా ప్రభుత్వ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంపై అవగాహన సదస్సు






**కాకినాడ (జయ జయహే)**

పిఠాపురం రాజా ప్రభుత్వ స్వయంప్రతిపత్తి కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం మరియు వాటి దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె. మెహర్ అధ్యక్షతన జరిగింది. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కె. పద్మశ్రీ , ఎమ్మెల్సీ, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని, సెల్‌ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలని, చెడు అలవాట్లకు దారితీసే వ్యక్తులు మరియు పరిసరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ముందుగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.కె. మెహర్ తన సందేశంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు మరియు దుష్పరిణామాలను వివరించారు. పోలీస్ శాఖకు చెందిన ఈగల్ టీమ్ తరపున సీఐ మరియు జి. వెంకటేశ్వరరావు తమ అనుభవాలను పంచుకున్నారు. మాదక ద్రవ్యాలను సేవించే వారు మరియు వాటి అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారికి సంబంధించిన సంఘటనలను ఉదాహరణలతో వివరించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

# యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలి



**జేసీఐ జోన్ డైరెక్టర్ చైతన్య రాజీవ్**

**విశాఖపట్నం, సెప్టెంబర్ 11, జయ జయహే**

యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించాలని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) జోన్ 4 డైరెక్టర్ చైతన్య రాజీవ్ పేర్కొన్నారు. జేసీఐ వారోత్సవాల్లో భాగంగా జేసీఐ వైజాగ్ పారామౌంట్ ఆధ్వర్యంలో మిస్సెస్ ఏవీఎన్ కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై పబ్లిక్ స్పీకింగ్, డిబేట్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు ఆయా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారు. జేసీఐ ప్రతినిధులు రామరాజు, భవాని, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమారి అధ్యాపకులు ఎం. లావణ్య, మౌనిక తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు బహుమతులు అందజేశారు.

# నైలెట్ తరలింపుపై జెన్‌జీ నిరసన

**తిరుపతిలోనే శాశ్వత క్యాంపస్ ఏర్పాటు చేయాలని డిమాండ్**

**తిరుపతి, సెప్టెంబర్ 11, జయ జయహే**



తిరుపతి: నైలెట్‌ను తిరుపతి నుంచి అమరావతికి తరలించడాన్ని నిరసిస్తూ జెన్‌జీ ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్వీ యూనివర్సిటీ రెండో గేట్ నుంచి మెయిన్ గేట్ వరకు జరిగిన ర్యాలీలో విద్యార్థులు, యువత, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ తిరుపతిలో సుమారు 15 ఎకరాల్లో నైలెట్ శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు డీపీఆర్ సిద్ధమైనప్పటికీ అమరావతికి తరలించడం అన్యాయమన్నారు. రాయలసీమ యువతకు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైలెట్ వంటి సంస్థలు ఎంతో అవసరమని తెలిపారు. తిరుపతికి ప్రతిపాదించిన నైలెట్‌తో పాటు ఇతర విద్యా, నైపుణ్య సంస్థలను కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఇన్‌చార్జ్ భూమన అభినయ్ రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎమ్మెల్సీ యండవల్లి శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి నియోజకవర్గం అనకాపల్లి మండలం కాలేజీ కొత్తూరు గ్రామంలో సచివాలయం కార్యాలయం నిర్వహిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని స్థానిక శాసనసభ్యులు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బందితో మాట్లాడి పెన్షన్ దరఖాస్తు దారులను వారి అర్హతలు అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరు దరఖాస్తు నిబంధనల ప్రకారం పరిశీలించి ఎలాంటి జాప్యం లేకుండా సకాలంలో ప్రక్రియను పూర్తి చేయాలని అక్కడ సచివాలయ సిబ్బందికి అధికారులకు ఆయన ఆదేశించారు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రయోజనాలు అందాల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అని ఎమ్మెల్యే రామకృష్ణ సూచించారు ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు నాయకులు స్థానిక ప్రజలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గురవారెడ్డి**

**ఏర్పేడు, సెప్టెంబర్ 11 జయ జయహే**

ఏర్పేడు: మండలంలోని మన్నసముద్రం రెవెన్యూ పరిధి బండారుపల్లి గ్రామంలో జరుగుతున్న రీ సర్వే కార్యక్రమాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, నెల్లూరు అర్బన్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు డాక్టర్ రెడ్డివారి గురవారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బండారుపల్లి, వెంకటాపురం గ్రామాలకు చెందిన రైతులను కలిసి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గురవారెడ్డి మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. అన్నదమ్ముల మధ్య, ఇరుగుపొరుగు రైతుల మధ్య ఉన్న భూ వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు రైతుల వద్దకే వస్తున్నారని తెలిపారు. 22ఏ కింద ఉన్న భూముల సమస్యల పరిష్కారంతో పాటు సన్న, చిన్నకారు రైతులకు సంబంధించిన ఫ్రీహోల్డ్ భూములను క్లియర్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రైతులు రీ సర్వే అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్రమణ్యం యాదవ్, పార్టీ నాయకులు శంకర్ రెడ్డి, ధనుంజయులు, రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు నాగరాజు, వంశీ, రైతులు పాల్గొన్నారు.





# ఘనంగా చీరల అలంకరణ కార్యక్రమం

**మాడుగుల సెప్టెంబరు 11, జయ జయహే**

శ్రావణమాసం చివర శుక్రవారం పురస్కరించుకొని మాడుగుల మండలం జంపిన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి 108 చీరలు అలంకరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. కెంతలి గాదిరాయి రూరల్ వాసవి క్లబ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలలు చే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ సంస్కృతి కార్యక్రమాలు చేపట్టి సాయంత్రం అమ్మవారికి అలంకరించిన 108 గోత్రాలు తో కూడిన 108 చీరలను వాసవి వనితలకు అందజేశారు. అలాగే మరికొందరికి పసుపు కుంకుమ జాకెట్ పీసులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్గుణంగా కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల చెందిన అనేక మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.




# ఉషోదయ డిగ్రీ కళాశాలలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**చోడవరం, సెప్టెంబర్ 11,జయ జయ హే**

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడంతో పాటు, పర్యావరణహితమైన వినాయక చవితి వేడుకలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఉషోదయ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో "మట్టి వినాయకుడిని పూజిద్దాం -- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే నినాదాలతో విద్యార్థులు, అధ్యాపకులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జే.రమణాజీ మాట్లాడుతూ, వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వినాయకుని మట్టి విగ్రహాలను ఉపయోగించడం మన సంప్రదాయాలను గౌరవించడమే కాకుండా ప్రకృతి పట్ల మన బాధ్యతను చాటుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎడ్యుకేషన్ డైరెక్టర్ జే.శ్యామ్ జీ, డీన్ ఎస్ వి వాసు, ప్రిన్సిపాల్ ఎస్ ఎన్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ పి దొరబాబు, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి అప్పలనాయుడు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్యాంకు ఉద్యోగుల కోరికలు

# న్యాయ సమ్మతమే

**మాడుగుల, సెప్టెంబర్ 11 జయ జయహే**



వారానికి రెండు రోజులు బ్యాంకులకు సెలవులు ఇవ్వాలన్న బ్యాంకు ఉద్యోగుల కోరిక న్యాయ సమ్మతమైననీ ప్రభుత్వం పరిశీలించాలని ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు విజ్ఞప్తి చేశారు. బ్యాంకు ఉద్యోగులు మనకు ఏసీలో కూర్చుని ఉద్యోగం చేస్తున్నట్టుగా కనిపిస్తారనీ కానీ వారి ఉద్యోగం చాలా టెన్షన్ తో కూడుకున్నదన్నారు. నిరంతరము కంప్యూటర్ల ముందు కూర్చున్న ఉద్యోగులకు త్వరగా జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, మెదడుకు సంబంధించిన ఇబ్బందులు ఎక్కువగా వస్తాయన్నారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలి అంటే మెదడు ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇప్పుడున్న పనికి బ్యాంకు ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారనీ, అత్యధిక మందికి కంటి చూపు తగ్గిపోతుందన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగుల కోర్కెలు వారానికి రెండు రోజులు బ్యాంకు ఉద్యోగులకు సెలవు ఇవ్వడం న్యాయమైనదే నన్నారు. అంతేకాదు రెవెన్యూ డిపార్ట్మెంట్ కూడా ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగాలే కాబట్టి రెవెన్యూ డిపార్ట్మెంట్ కూడా శని ఆదివారాలు బ్యాంకు ఉద్యోగులు అడిగిన రీతిలోనే రెవెన్యూ డిపార్ట్మెంట్ కూడా రెండు రోజులు సెలవు ప్రకటించాలనీ కోరారు. అవకాశం ఉంటే అన్ని శాఖలకు కూడా శని ఆదివారాలు సెలవు ప్రకటిస్తే మంచిదని ఉద్యోగుల ఆరోగ్యం పట్ల కూడా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వారి చేతుల్లోనే ప్రజల భవిష్యత్తు ఉంటుంది కాబట్టి వారు ఆరోగ్యంగా ఉంటేనే ప్రజలకు సేవ చేయడానికి వీలుంటుందని ఇప్పటికే చాలామంది ఉద్యోగులు రోజుకు 4 నుండి 6 మాత్ర లు వేసుకుంటూ ఉద్యోగం చేస్తున్నారు కాబట్టి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై చర్చించి వీరందరికీ వారానికి రెండు రోజులు సెలవు ఇవ్వాలని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కోరుతుందన్నారు.



శ్రీకాళహస్తీశ్వరుడిని దర్శించుకున్న

# సీబీఐ డైరెక్టర్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11, జయ జయహే**

శ్రీకాళహస్తి సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఐపీఎస్ శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ బీకే వెంకటేశులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. దేవస్థానం తరపున తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేసి సీబీఐ డైరెక్టర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు, ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి, శ్రీకాళహస్తి డీఎస్పీ ఎన్.ఎస్. మూర్తి, సీఐ, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్

## కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 11, జయ జయహే**



శ్రీకాళహస్తి కోర్టు ఆవరణంలో ఈ నెల 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చైర్మన్, 12వ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి తెలిపారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్, మ్యాట్రిమోనియల్, పెట్టీ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసులతో పాటు రాజీ చేసుకునేందుకు అవకాశం ఉన్న ఇతర కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సంబంధిత కక్షిదారులను పిలిపించి ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా పోలీసు అధికారులు, న్యాయవాదులు సహకరించాలని సూచించారు. పట్టణ ప్రజలతో పాటు న్యాయవాదులు, బీఎస్ఎన్ఎల్, పోలీస్ శాఖ, బ్యాంకులు తదితర సంస్థలు ఈ జాతీయ లోక్ అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి కోరారు.

# ఆలూ బుఖారాతో బోలెడన్ని లాభాలు!





వర్షాకాలంలో వ్యాధుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆహార విషయానికొస్తే తగిన జాగ్రత్తలు ఎంతో ముఖ్యం. ఈ సీజన్‌లో ఆలూ బుఖారాతో కొన్ని ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. అవేంటో చూద్దాం.

ఆలూ బుఖారాలో విటమిన్ సి ప్రోటీన్ పుష్కలంగా దొరుకుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతూ, ఇతర ఇన్ఫెక్షన్ల నుంచి రక్షిస్తుంది. ఈ పండు శక్తివంతమైన యాంటీయాక్సిడెంట్లను కలిగి ఉండటంతోపాటు ఈ వ్యాధులను కూడా నివారిస్తుంది.

**ఆలూ బుఖారాతో ప్రయోజనాలు..**

ఆలూ బుఖారా జీర్ణవ్యవస్థ సమస్యలను తొలగించడంతోపాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది. అలాగే కడుపు నొప్పి సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు.

ఈ పండు తీపిగా ఉన్నప్పటికీ, మధుమేహ రోగులకు ప్రయోజనాన్నిస్తుంది. ఇది పీచు పదర్థంగా ఉంటూ, రక్తంలో అవసరమైనంత చక్కెర స్థాయినిస్తుంది. షుగర్ పేషెంట్లు కూడా ఆలూ బుఖారాను తక్కువ మోతాదులో తీసుకోవచ్చు.

ఎముకలు దృఢంగా మారడంలో ఆలూ బుకారా ఎంతో ఉపయోగకరం. ఎముకలు దెబ్బతినకుండా, ఎముకల వ్యాధి వంటి ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి కాపాడుతుంది.

అధిక రక్తపోటు నుంచి రక్షించడంతోపాటు, దీన్ని తినడంతో బీపీ, కొలెస్ట్రాల్ అదుపులో ఉంటాయి. ఇది గుండె సంబంధిత వ్యాధులను కూడా అరికడుతుంది.

విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు సమృద్ధిగా ఉండటంతో ఆలూ బుఖారా ఆరోగ్యాన్ని నిలకడగా ఉంచడంలో ఎంతో తోడ్పడుతుంది. దీనిని తీసుకోవడంతో ఫిట్‌నెస్ కూడా మెరుగుపడుతుంది.

# వర్షాకాలంలో మెరిసే చర్మానికి...



వర్షాకాలంలో చర్మం జిగటగా మారుతుంది. కొన్నిసార్లు సూర్యరశ్మి, కొన్నిసార్లు తేమ, తేమతో కూడిన వర్షం చర్మంపై ఎక్కువగా ప్రభావం చూపుతుంది. మొటిమలు, మొటిమల సమస్యలు కూడా పెరుగుతాయి. అటువంటి సమయంలో చర్మంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరం. వర్షాకాలంలో మీ చర్మం మెరుపు చెక్కుచెదరకుండా ఉండటానికి ఎలా ప్రత్యేక శ్రద్ధ వహించాలో కొన్ని చిట్కాలు ఉన్నాయి. వర్షాకాలంలో చర్మం అనేక సమస్యలను ఎదుర్కొంటుంది. దీనివల్ల ముఖంపై పగుళ్లు, జిగట, దురద వంటి సమస్యలు తలెత్తుతాయి. వర్షాకాలంలో మీ ముఖాన్ని, చర్మం మెరిసిపోయే రహస్యాన్ని గురించి ఇప్పుడు కొన్ని విషయాలు తెలుసుకుందాం.

**ముఖాన్ని శుభ్రం చేయటం ముఖ్యం:**

వర్షాకాలంలో ముఖాన్ని శుభ్రం చేసుకోవడం చాలా ముఖ్యం. రోజుకు కనీసం రెండు సార్లు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ముఖం కడుక్కోవడానికి నీమ్‌ఫేస్ వాష్, గ్రీన్ టీ ఫేస్‌వాష్, టీ ట్రీ ఫేస్‌వాష్ ఉపయోగించడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

**రోజ్ వాటర్ :**

రోజ్ వాటర్‌తో ముఖం సహజమైన మెరుపును కాపాడుకోవచ్చు. రోజ్ వాటర్ అనేది వర్షాకాలంలో ఉపయోగించడం మంచిదని భావించే టోనర్. ఈ సీజన్‌లో ఫేస్ క్రీమ్‌కు బదులుగా రోజ్ వాటర్‌ను ముఖానికి రాసుకోవడం మంచిది.

**నూనె:**

చర్మం జిడ్డుగా ఉంటే డస్టింగ్ పౌడర్‌ను ఉపయోగించాలి. ఇలా చేయకపోతే చర్మంపై అదనపు నూనె చర్మ సమస్యలను పెంచుతుంది. కావున దీనిని దృష్టిలో ఉంచుకోవాలి.

**లైట్‌ఫేస్ ఆయిల్:**

వర్షాకాలంలో చర్మానికి మాయిశ్చరైజర్‌ను మెయింటెయిన్ చేయడానికి.. లైట్‌ఫేస్ ఆయిల్‌ని ఎంచుకోవాలి. ఇలా చేయడం వల్ల మొటిమలు, మొటిమలు వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అందువల్ల ఎల్లప్పుడూ తేలికపాటి నూనెను మాత్రమే వాడాలి.

**అలోవెరా:**

వర్షాకాలంలో చర్మంలో దురద, చికాకును నివారించడానికి.. అలోవెరా జెల్‌ను ఉపయోగించి ఓదార్పు అనుభూతిని ఇవ్వడానికి, దానిని హైడ్రేట్‌గా ఉంచడానికి ఉపయోగించవచ్చు. కలబందలోని యాంటీ బాక్టీరియల్ మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఈ సీజన్‌లో మీ చర్మానికి చాలా మేలు చేస్తాయి. మీకు కావాలంటే, మీరు కలబంద ఆకులను తీసి దాని నుండి తాజా జెల్‌ను తీసి నేరుగా చర్మానికి అప్లై చేసి 20-25 నిమిషాలు అలాగే ఉంచవచ్చు. తర్వాత నీటితో శుభ్రం చేసుకోవాలి. చర్మం సహజమైన మెరుపు అలాగే ఉంటుంది.



# బాలిక ఉన్నత విద్యకు రోటరీ ప్రోత్సాహం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 11, జయ జయహే**

రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఒక బాలిక ఉన్నత విద్యకు రూ. 30 వేల ఆర్థిక సహాయాన్ని అందించి ప్రోత్సహించింది. అవంతి కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న ఎస్.వర్ణిత సాయి లక్ష్మి అనే విద్యార్థికి చెక్ రూపంలో ఈ సహాయం అందించారు. రామ్ నగర్ లో జరిగిన రోటరీ క్లబ్ బోర్డు సభ్యుల సమావేశంలో రొటేరియన్ చార్టెడ్ అకౌంటెంట్ గోపికృష్ణ ప్రోద్బలంతో విద్యార్థినికి ఈ సహాయాన్ని అందించారు. గత మూడు సంవత్సరాలుగా ఈ బాలిక ఉన్నత విద్యకు రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ తరుపున ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని క్లబ్ ప్రెసిడెంట్ సిహెచ్. కామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కె.ఎం.కె. రమేష్, ట్రెజరర్ ప్రభు జనార్ధన్, పి.డి.జి. సి హెచ్. కిషోర్ కుమార్, డాక్టర్ టీ.వీ.ఎస్. రావు, బి. శంకర్రావు, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు. ఏటా తన ఉన్నత చదువుల కోసం ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న రోటరీ క్లబ్ కు విద్యార్థిని వర్ణిత సాయి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

**అనకాపల్లి (జయ జయహే)**

పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయాలను, ప్రకృతి హితమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రోత్సహించే లక్ష్యంతో గ్రీన్ క్లబ్--అనకాపల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 12, శనివారం ఉదయం 9 గంటలకు అనకాపల్లి రాజా థియేటర్ ఎదురుగా ఉన్న జీవీఎంసీ హైస్కూల్ ప్రాంగణంలో 3,500 మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు గ్రీన్ క్లబ్ వ్యవస్థాపకులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు గ్రహీత కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ గ హాజరై మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అలాగే శ్రీ గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసి నాయుడు ప్రత్యేకంగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలతో పాటు వ్రతకథ పుస్తకాలు, పసుపు, కుంకుమ, పటిక ఉచితంగా అందజేయనున్నారు. "మట్టి వినాయకుడు -- మన పర్యావరణానికి మిత్రుడు" వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజంగా కలిసిపోయే మట్టి వినాయక విగ్రహాలను ఉపయోగించడం ద్వారా జల కాలుష్యాన్ని నివారించవచ్చని గ్రీన్ క్లబ్ నిర్వాహకులు ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.




Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com